నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
29 మే 2024
పేజీలు 8

## శ్రీనివాస్ ఆర్ కులకర్ణి

కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ కులకర్ణికి షా ప్రైజ్ దక్కింది. ఖగోళ శాస్త్రంలో పరిశోధనలకు ఆయన దీన్ని దక్కించుకున్నారు. మిల్లీసెకండ్ పల్సర్‌లు, గామా కిరణాలకు సంబంధించి ఆయన పరిశోధనలు చేశారు. వైద్యం, జీవశాస్త్రం, ఖగోళశాస్త్రాల్లో పరిశోధనలు చేసే వారికి ఈ అవార్డులు ఇస్తారు. ఏటా ముగ్గురిని ఎంపిక చేస్తారు. హాంకాంగ్‌కు చెందిన, రన్‌రన్ షా అనే సామాజిక సేవకుడు 2002లో ఈ అవార్డును ఏర్పాటు చేశాడు.

## రోజులు-

**మే 23**

- ఏటా మే 23న ప్రపంచ తాబేళ్ల (టర్టిల్) రోజుగా నిర్వహిస్తారు. ఈ జాతిని రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తారు.



**మే 22**

- 'ప్రణాళికలో భాగం కండి' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ జీవ వైవిధ్య రోజుగా నిర్వహించారు. 1993 నుంచి మే 22ను జీవ వైవిధ్య రోజుగా నిర్వహిస్తున్నారు.

**మే 21**

- ఏటా మే 21న ప్రపంచ సాంస్కృతిక వైవిధ్య రోజుతో పాటు అంతర్జాతీయ తేనీరు దినోత్సవంగా కూడా నిర్వహిస్తారు. ప్రపంచ ఆహార సంస్థ దీన్ని చేపడుతుంది. అలాగే జాతీయ ఉగ్రవాద వ్యతిరేక రోజుగా కూడా మే 21నే నిర్వహిస్తారు.

**మే 20**

- ఏటా మే 20న తేనెటీగల రోజుగా నిర్వహిస్తారు. తేనెటీగల పరిరక్షణలో ఎంతో కృషి చేసిన ఆంటోన్ జన్సా జన్మదినం సందర్భంగా ఈ రోజును జరుపుతారు.

**యూఎన్‌డీపీ-భారత్**

- వ్యాక్సిన్ డిజిటలీకరణ, గొలుసు సరఫరా నిర్వహణకు యూఎన్‌డీపీతో భారత్‌కు చెందిన పశుసంపద-పాడి-మత్స్య విభాగం ఒప్పందం కుదుర్చుకుంది.

**ఐసీసీ**

- నెదర్లాండ్స్‌లోని హేగ్ కేంద్రంగా ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐసీసీ) పనిచేస్తుంది. ఇటీవల ఈ సంస్థ ఇద్దరిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూ, హమాస్ అధినేత యోవ్ గాలంట్‌పై ఈ వారెంట్ జారీ అయింది. ఐసీసీ ఇచ్చే తీర్పులకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. రోమ్ స్టాట్యూట్ ప్రకారం ఈ సంస్థ ఏర్పాటయ్యింది. వ్యక్తులపై వచ్చే జీనోసైడ్ ఆరోపణలకు సంబంధించి విచారిస్తుంది.

**డ్రీమ్స్ ప్రాజెక్ట్**

- న్యూయార్క్ కేంద్రంగా యునిసెఫ్ పని చేస్తుంది. 'డ్రీమ్స్' అనే ప్రాజెక్టుకు సంబంధించి అసోం రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని పూర్తి రూపం- డిజాస్టర్ రిపోర్టింగ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం. అంటే విపత్తులు సంభవించినప్పుడు సంబంధిత సమాచారాన్ని సేకరించడం, నిర్వహించడం. నష్టపోయిన పంటలు, పశుసంపద తదితర అంశాలను శాస్త్రీయంగా సేకరిస్తారు.



## అంతర్జాతీయం

**అటకామా అబ్జర్వేటరీ**

- అటకామా అబ్జర్వేటరీని టోక్యో యూనివర్సిటీ ఏర్పాటు చేసింది. చిలీలోని అంటోఫగాస్తా ప్రాంతంలో దీన్ని నిర్మించింది. ఇది



సముద్ర మట్టానికి 5640 మీటర్ల ఎత్తులో ఉంది. ప్రపంచంలో అత్యంత ఎత్తులో ఉన్న అబ్జర్వేటరీగా ఇది గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. కృష్ణ పదార్థ అధ్యయనం, అంతరిక్షంలో అంతు చిక్కని రహస్యాలను కనుగొనేందుకు ఇక్కడి నుంచి పరిశోధనలు చేస్తారు.

**ఐఎల్‌వో**

- జెనీవా కేంద్రంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ పని చేస్తుంది. సార్వత్రిక సామాజిక భద్రతకు సంబంధించి ఇది ఒక నివేదికను విడుదల చేసింది. అల్పాదాయంగా ఉన్న 143 దేశాలకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. భారత్‌లో సామాజిక భద్రతకు 135 బిలియన్ డాలర్లు వ్యయం చేయాలని సంస్థ పేర్కొంది. ఇది ప్రభుత్వ వ్యయంలో 11.8 శాతానికి సమానం.

**అంతర్జాతీయ సౌర కూటమి**

- భారత్‌లో హర్యానాలోని గురుగ్రామ్ కేంద్రంగా పనిచేసే సంస్థ ఇది. 99వ సభ్య దేశంగా ఇటీవల స్పెయిన్ చేరింది. సౌరశక్తి సాంకేతికతను పెంపొందించుకొనేందుకు ఉద్దేశించిన వ్యవస్థ ఇది. భారత్, ఫ్రాన్స్ కలిసి సంయుక్తంగా దీన్ని ఏర్పాటు చేశాయి. భారత్ కేంద్రంగా ఏర్పాటైన తొలి అంతర్జాతీయ సంస్థ ఇది.

**ఆర్తర 24**

- ఆర్తర 24 పేరుతో దుబాయ్‌లో భారత సంస్కృతిని ప్రతిబింబించే ఆర్ట్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. భారత చిత్రకారులు చిత్రించిన 250 కళాఖండాలను ఇందులో ప్రదర్శించారు. భిన్నత్వంలో ఏకత్వ భావనను తెలిపేందుకు ఉద్దేశించింది ఇది.

**పాలస్తీనా**

- పాలస్తీనాను ఒక స్వతంత్ర రాజ్యంగా నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ గుర్తించాయి.

**ట్రావెల్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్**

- స్విట్జర్లాండ్ కేంద్రంగా పని చేస్తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రయాణ-పర్యాటక అభివృద్ధి సూచీ (ట్రావెల్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్)ని విడుదల చేసింది.




ఇందులో భారత్ 39వ స్థానంలో ఉంది. తొలి నాలుగు స్థానాల్లో వరుసగా స్పెయిన్, జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా నిలిచాయి. 2021లో భారత్ 54వ స్థానంలో ఉంది.

## క్రీడలు

**దీప్తి జీవాంజీ**




- తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి జీవాంజీ ప్రపంచ రికార్డ్ నెలకొల్పింది. జపాన్‌లోని కొబేలో జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెట్ల చాంపియన్‌షిప్‌లో ఆమె విజయాన్ని అందుకుంది. 400 మీటర్ల పోటీలో ఈ రికార్డ్ సృష్టించింది. 55.07 సెకన్లలో దీప్తి పరుగును పూర్తి చేసింది. గత రికార్డ్ 55.12 సెకన్లుగా ఉంది. అమెరికాకు చెందిన బ్రెన్నా క్లార్క్ పేరిట ఈ రికార్డ్ ఉంది.

**ఫిఫా మహిళల ప్రపంచకప్**

- ఫిఫా మహిళల ప్రపంచకప్‌ను 2027లో బ్రెజిల్‌లో నిర్వహించనున్నారు. ఈ టోర్నీని దక్షిణ అమెరికా ఖండంలో నిర్వహించడం ఇదే ప్రథమం. 2023లో ఈ పోటీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో జరిగింది.

**థాయిలాండ్ ఓపెన్**

- భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్‌శెట్టి జోడీ థాయిలాండ్ ఓపెన్ 2024 బ్యాడ్మింటన్‌లో విజయం సాధించింది. తుదిపోరులో వీరు చైనాకు చెందిన చెన్ బో యంగ్, లీయూ లను ఓడించారు.

## జాతీయం

**శక్తి**



- శక్తి పేరుతో భారత్, ఫ్రాన్స్ మేఘాలయాలోని ఉమ్రోయిలో సైనిక విన్యాసాలు నిర్వహించాయి. మే 13న ప్రారంభమై 26 వరకు ఇవి కొనసాగాయి.

**46వ అంటార్కిటిక్ సమావేశం**

- కేరళలోని కొచ్చిలో 46వ అంటార్కిటిక్ ఒప్పంద సంప్రదింపుల సమావేశం నిర్వహిస్తున్నారు. మే 20న ప్రారంభమైన ఈ సమావేశం 30 వరకు కొనసాగుతుంది. ఈ తరహా సమావేశం భారత్‌లో గతంలో 2007లో నిర్వహించారు. అంటార్కిటికా నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, పర్యాటక నియంత్రణ అభివృద్ధితో పాటు భారత్ మరో పరిశోధన కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చించారు.

**కాల్షియం కార్బైడ్**

- పళ్లను పక్వానికి తెచ్చేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగించరాదని ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ ఆదేశించింది. దీన్ని వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి బదులుగా ఇథిలీన్ గ్యాస్ వినియోగించుకోవాలని సూచించింది.

**ఓబీసీ హోదా రద్దు**

- పశ్చిమబెంగాల్‌లో కొన్ని కులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్ట్ తీర్పు చెప్పింది. ముస్లింలోని 77 ఉప కులాలకు ఈ రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2010 నుంచి ఇవి అమలవుతున్నాయి. మతాన్నే ఏకైక ప్రామాణికంగా పరిగణించారంటూ కోర్ట్ తన తీర్పులో పేర్కొంది. అయితే ఈ రిజర్వేషన్లు పొందాక ప్రభుత్వ ఉద్యోగులు, సర్వీసులకు ఎంపికయిన వారికి ఈ తీర్పు వర్తించదని, వారు యధావిధిగా కొనసాగవచ్చని వెల్లడించింది.

**డాప్లర్ రాడార్ స్పీడ్‌గన్స్**

- రహదార్లపై వాహనాల వేగాన్ని కొలిచేందుకు ఉద్దేశించిన రాడార్ స్పీడ్ గన్స్‌కు కొత్త నిబంధనలను వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. స్పీడ్ గన్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక సంవత్సరంలోపు మరోసారి తనిఖీ చేయించుకోవాలి. కొత్తవి ఏర్పాటు చేయబోతున్న, ఇప్పటికే ఏర్పాటు చేసినవన్నీ మరోసారి తనిఖీకి తీసుకెళ్లాలి. డాప్లర్ ప్రభావం అనే భౌతిక ప్రక్రియ ఆధారంగా ఈ స్పీడ్ గన్స్ పనిచేస్తాయి.

**మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్**



- ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో ఇళయరాజా సెంటర్ ఫర్ మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ ప్రారంభం కానుంది. దీని నిర్మాణానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి శంకుస్థాపన చేశారు.

## వార్తల్లో వ్యక్తులు

**మొహమ్మద్ మొఖ్‌బెర్**

- ఇరాన్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ మొఖ్‌బెర్‌ను ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు. ఆ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ విమాన ప్రమాదంలో మరణించడంతో ఈ నియామకాన్ని చేపట్టారు. ఆ దేశ నియామవళి ప్రకారం 50 రోజుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

**జ్యోతి రాత్రే**



- భోపాల్‌కు చెందిన 55 ఏళ్ల జ్యోతి రాత్రే అనే మహిళ ఎవరెస్ట్ శిఖరాన్ని మే 19న అధిరోహించారు. అతి ఎక్కువ వయసులో ఎవరెస్ట్‌ను అధిరోహించిన భారత మహిళగా ఆమె రికార్డ్ సృష్టించారు. గతంలో సంగీతా బాల్ అనే మహిళ తన 53వ ఏట ఎవరెస్ట్ అత్యున్నత స్థానానికి చేరారు.

**క్రిస్టియానో రొనాల్డో**

- ఫోర్బ్స్ జాబితా ప్రకటించిన అత్యధికంగా వేతనం పొందుతున్న అథ్లెట్ల జాబితాలో క్రిస్టియానో రొనాల్డో అగ్రస్థానంలో నిలిచాడు.

**బిక్రంజిత్ చౌధురీ**

- బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ సెంటర్‌కు చీఫ్ ఆఫ్ మెజర్‌మెంట్ సైన్స్-అనలిటిక్స్‌గా బిక్రంజిత్ చౌధురీ నియమితులయ్యారు. టెలివిజన్ ప్రేక్షకులకు సంబంధించి వీక్షకులను గణించే సంస్థల్లో ప్రపంచంలోనే ఇది అతిపెద్దది.

**జెన్నీ ఎర్పెన్‌బెక్**

- కైరోజ్ అనే రచన చేసినందుకు జెన్నీ ఎర్పెన్‌బెక్ ఇంటర్నేషనల్ బుకర్‌ప్రైజ్‌ను పొందారు. దీన్ని అనువదించిన మైఖేల్ హాఫ్‌మన్ కూడా అవార్డ్ పొందిన వారిలో ఉన్నారు.

**సంజీవ్ పురి**

- కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీకి అధ్యక్షుడిగా ఐటీసీ చైర్మన్ ఎండీ సంజీవ్ పురి బాధ్యతలను స్వీకరించారు. 2024-25 సంవత్సరానికి ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

**టూ లామ్**

- వియత్నాం కొత్త అధ్యక్షుడిగా టూ లామ్‌ను నామినేట్ చేశారు. అలాగే తైవాన్ అధ్యక్షుడిగా లియి చింగ్-తే బాధ్యతలు స్వీకరించారు.

## తెలంగాణ

**రైల్వే కారిడార్‌కు నోటిఫికేషన్**

- సింగరేణి గనులు విస్తరించిన ప్రాంతాలను కలుపుతూ పెద్దపల్లి జిల్లా రామగుండం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య ప్రత్యేక రైల్వే బొగ్గు రవాణా నడవాను ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ వెలువడింది. ఇది 207.80 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. రూ.2911 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే బొగ్గు రవాణా వ్యయం తగ్గుతుంది.

**అమ్మ యాప్**

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ విద్యార్థులు అమ్మ పేరిట యాప్‌ను ఆవిష్కరించారు. మాటలు సరిగా రాని పిల్లల కోసం ఇది ఉద్దేశించింది. తొలి దశలో 50 పదాలతో ఆటల రూపంలో మాటలు మాట్లాడేలా చేస్తారు. మాటలు రాని, బుద్ధి మాంద్యం ఉన్న 3-5 ఏళ్ల లోపు పిల్లలకు



ఇది ఉపయోగపడుతుంది.

**బీసీజీ టీకా**

- క్షయ వ్యాధి నిర్మూలన కోసం 18 సంవత్సరాలు పైబడిన వాళ్లకు కూడా బీసీజీ టీకా ఇవ్వాలని నిర్ణయించారు. తొలి దశలో 17 జిల్లాల్లో గుర్తించిన సుమారు 60 లక్షల మందికి ఒక డోసు టీకా ఇస్తారు. 2025 నాటికి క్షయ లేకుండా చేయాలనేది లక్ష్యం.

**జాతీయ ఆరోగ్య మిషన్**

- జాతీయ ఆరోగ్య మిషన్ కింద 2024-25 సంవత్సరానికి రూ.1411 కోట్లు వ్యయం చేయనున్నారు. ఇందుకు 60% కేంద్రం, 40% రాష్ట్రం భరిస్తాయి. మాతాశిశు సంరక్షణతో పాటు వ్యాధుల నిర్మూలన దీని ప్రధాన లక్ష్యం.

**మెగా ఫుడ్ పార్క్**

- రాష్ట్రంలో అతిపెద్ద మెగా ఫుడ్ పార్క్ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో దీన్ని నిర్మించనున్నారు. 41.26 ఎకరాలు నిర్మాణాలు, ఇతర మౌలిక వసతులకు 10.45 ఎకరాలు కేటాయించారు.

**ఏకు చిరంజీవి**

- ఎవరెస్ట్ శిఖరాన్ని తెలంగాణకు చెందిన ఏకు చిరంజీవి అధిరోహించారు. ఆయన హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ రాజీపేటలోని అంబేద్కర్ కాలనీకి చెందిన వారు. మనుషులంతా సమానం అనే సందేశాన్ని చాటుతూ పర్వత రోహణ చేశారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

